క్లుప్తంగా

సంపద కేంద్రాలు వినియోగంలోకి తేవాలి



చెర్లోపల్లిలో సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి

గుత్తి రూరల్: గ్రామాల్లో నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పరిషత్ సీఈఓ రామచంద్రారెడ్డి సూచించారు. చెర్లోపల్లి పంచాయతీలోని ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని జెడ్పీ సీఈఓ శనివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రోజూ పోగయ్యే చెత్త నుంచి సంపద తయారు చేసి గ్రామ పంచాయతీకి ఆదాయం వచ్చేలా చూడాలన్నారు. ప్రతి పంచాయతీలో సంపద తయారీ కేంద్రాల నుంచి వర్మీ కంపోస్టు ఎరువులు తయారు చేసి గ్రామంలోని రైతులకు తక్కువ ధరకు విక్రయించాలన్నారు. కేంద్రాల చుట్టూ పరిసరాలను శుభ్రంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అప్పా వెంకటేష్, ఎంపీడీఓ ప్రభాకర్‌నాయక్, ఈఓఆర్డీ శివాజీరెడ్డి, కార్యదర్శి సుమలత పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎథిక్స్ పరీక్ష

గుత్తి: పట్టణంలోని అన్ని జూనియర్ కాలేజీల్లో శనివారం ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్ పరీక్షలు నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీ, శ్రీ సాయి జూనియర్ కాలేజీ, మోడల్ కాలేజీ, మహాత్మా కాలేజీ లతో ఎథిక్స్ పరీక్షను నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్షలు నిర్వహించారు. పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి.

కుష్టుపై సర్వే



సర్వే చేస్తున్న సిబ్బంది

తాడిపత్రి రూరల్: మండలంలో కుష్టు వ్యాధిపై శనివారం వైద్య సిబ్బంది సర్వే చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇంటింటి సర్వే చేయిస్తున్నామని వైద్యుడు బాలఓబులు తెలిపారు. డిసెంబర్ 18 నుంచి జనవరి 2 వరకూ సర్వే చేస్తామన్నారు. అనుమానం ఉన్న వ్యక్తులకు వైద్య పరీక్షలు జరిపి మందులను అందజేస్తామన్నారు.జనవరి 3 నుంచి 13వ తేదీ వరకూ ఎన్‌జీఓలు, సిబ్బందితో గ్రామాల్లో కుష్టు వ్యాధిపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

ఎలక్ట్రికల్ సిస్టంపై అవగాహన అవసరం



వెంకటరెడ్డిని సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

బుక్కరాయసముద్రం: బీటెక్ విద్యార్థులకు చదువుతో పాటు ఎలక్ట్రికల్ సిస్టంపై అవగాహన ఎంతో అవసరమని ప్రొఫెసర్ డాక్టర్ వెంకటరెడ్డి సూచించారు. శనివారం మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ (అటానమస్)ఇంజినీరింగ్ కళాశాలలో ఈఈఈ విభాగం ఆధ్వర్యంలో బోధనేతర సిబ్బంది కోసం ఎలక్ట్రికల్ సేఫ్టీ మెయింటెన్స్‌పై ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ అధ్యక్షతన వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటరెడ్డి మాట్లాడుతూ విద్యుత్ సామగ్రి ఉపయోగించుటలో అప్రమత్తత అవసరమన్నారు. విద్యార్థులు ఎలక్ట్రికల్ సిస్టంపై జాగ్రత్తలు పాటించాలన్నారు. అనంతరం కళాశాల యాజమాన్యం వెంకటరెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో ఈఈఈ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ అరవింద్ బాబు, వివిధ విభాగాల అధిపతిలు, తదితరులు పాల్గొన్నారు.

తూకాల్లో మోసాలను అరికట్టాలి



కందుల కొనుగోలును పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

గుంతకల్లు రూరల్: కందుల కొనుగోలు కేంద్రంలో తూకాల్లో జరుగుతున్న మోసాలను అధికారులు అరికట్టాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన కందుల కొనుగోలు కేంద్రాన్ని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, సహాయ కార్యదర్శి మహేష్, మండల కార్యదర్శి రాము రాయల్ తదితరులు మాట్లాడుతూ గుంతకల్లులోని కొనుగోలు కేంద్రంలో క్వింటాల్‌కు ఒక టిన్నర కిలోల మేర కందులను ఎక్కువగా తీసుకుంటూ రైతులను మోసం చేస్తున్నారన్నారు. దళారుల చేతిలో మోసపోతున్న రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు వస్తే ఇక్కడ కూడా తూకాల్లో మోసాలకు పాల్పడటం ఏమిటని వారు ప్రశ్నించారు. ఉన్నతాధికారులు స్పందించి తూకాల్లో జరుగుతున్న మోసాలను అరికట్టాలన్నారు.



మట్టి తరలించడంతో గుంతలు పడిన దృశ్యం



ఎస్కేడీ కళాశాల వద్ద ఉన్న వెంచర్‌లో గరుసు వదులుతున్న ట్రాక్టర్లు



తమ్ముళ్ల మట్టి దందా

- విచ్చలవిడిగా గరుసు తరలింపు
- జేబులు నింపుకుంటున్న టీడీపీ నాయకులు
- పట్టించుకోని అధికారులు

అధికారం మాది..ఏం చేసినా అడిగేవారెవరన్న దర్పంతో టీడీపీ నాయకులు మట్టి, ఇసుక కొల్లగొడుతున్నారు. పట్టపగలే అందరూ చూస్తుండగానే సహజ వనరులను దోచుకుంటున్నారు. ప్రభుత్వానికి పైసా చెల్లించకుండా, ఎలాంటి అనుమతులు తీసుకోకుండా అప్పనంగా దోచుకుంటున్నారు. ప్రజాప్రతినిధుల అండ కూడా ఉండడంతో మరింతగా రెచ్చిపోతున్నారు. పెద్దవడుగూరు సమీపంలో రాత్రి పూట అక్రమంగా గరుసు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అలాగే అనుమతి లేకుండా ఇసుక తరలిస్తూ జేబులు నింపుకుంటున్నారు.

పెద్దవడుగూరు: టీడీపీ నాయకుల అక్రమాలు రోజు రోజుకూ పెరిగిపోతున్నాయి. కూటమి ప్రభుత్వం కొలువైన అనంతరం అటూ పోలీసులు, ఇటు రెవెన్యూ అధికారులను కోరిన వారి తెచ్చుకొని విచ్చలవిడిగా అక్రమాలకు తెగబడుతున్నారు. అధికారంలోకి రాగానే అభివృద్ధి పనుల పేరుతో టీడీపీ నాయకులు పెద్దవడుగూరులో దేవాదాయ భూముల్లోని ఎర్రమట్టిని కొల్లగొట్టారు. కొందరు నాయకులు ప్రైవేటు స్థలాలకు మట్టిని తరలిస్తూ లక్షల రూపాయలు జేబులు నింపుకున్నారు. గత కొద్ది రోజులుగా గుత్తి అనంత పురం సమీపంలోని ప్రభుత్వ భూమి వంక వద్ద నుంచి ఇసుక, గరుసు మట్టిని అక్రమంగా గుంతకల్లు, గుత్తి పట్టణా ల్లో వెంచర్లకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఏకంగా జేసీబీ పెట్టుకుని 10 ట్రాక్టర్లతో పగలు, రాత్రి తేడా లేకుండా మట్టిని తరలిస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు. టీడీపీ మండల నాయకుడు తమ వాహనాలను పట్టుకోవద్దని అధికారులకు హుకుం జారీ చేశారని, అందుకే పట్టించుకోలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఎవరైనా సామాన్యులు అవసరాలకు మట్టి, ఇసుకను తోలుకుంటే వెంటనే ట్రాక్టర్లను పోలీసులకు పట్టిస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఇదే విషయమై అధికారులను వివరణ కోరగా మేం ఎవరికీ అనుమతులు ఇవ్వలేదని, మైన్స్ అండ్ జియాలజీ అధికారుల నుండి అమనుమతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. మట్టి తరలింపు ఇలాగే కొనసాగితే మండలంలో భూగర్భ జలాలు తగ్గి తాగునీటి ఎద్దడి ఏర్పడే అవకాశాలు మెండుగా ఉన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమంగా తరలివెళ్తున్న ఇసుక, మట్టిని నియంత్రించాలని మండలవాసులు కోరుతున్నారు.



పెద్దవడుగూరు వద్ద రాత్రి సమయాల్లో అక్రమంగా గరుసు తవ్వకాలు చేస్తున్న దృశ్యం



గుత్తి అనంతపురంలో జేసీబీతో గరుసు నింపుతున్న దృశ్యం

ఇసుక ట్రాక్టర్ల సీజ్

యాడికి: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సీజ్ చేసి ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ ఈరన్న తెలిపారు. శనివారం సాయంత్రం మండలంలోని వేములపాడు క్రాస్ వద్ద తాడిపత్రి వద్ద ఉన్న పెన్నానది నుంచి ఇసుకను తరలిస్తున్న ఇగుదూరు గ్రామానికి చెందిన నాగేష్, యాడికి మండల కేంద్రానికి చెందిన కరుణాకర్, హరిబాబు అనే వ్యక్తులు ట్రాక్టర్ల ద్వారా తరలిస్తుండగా.. ట్రాక్టర్లను సీజ్ చేశామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఘనంగా నవగ్రహ ప్రతిష్ట

గుత్తి రూరల్: మండలంలోని చెర్లోపల్లి పంచాయతీ సేవాగఢ్‌లోని మాతా జగదాంబ ఆలయంలో దుర్గా పంచాయతనం, నవగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు శనివారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో అర్చకులు సుబ్రమణ్య గణపతి శాస్త్రి, మారుతీ ప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో వేకువజాము నుంచి గోపూజ, మూల మంత్రహోమాలు, గ్రామోత్సవం, దుర్గా హోమాలు నిర్వహించారు. చండీ హోమం, నవగ్రహ హోమం, మండప పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆదివారం యంత్ర, విగ్రహ ప్రతిష్టతో నవగ్రహ ప్రతిష్ఠోత్సవాలు ముగుస్తాయని అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో సేవాలాల్ ట్రస్టు ఉపాధ్యక్షుడు కేశవనాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ రవీంద్రనాయక్, సభ్యులు బాలానాయక్ పాల్గొన్నారు.

వైభవంగా మార్కండేయస్వామి జయంతి



సీబీ రోడ్డులో మార్కండేయస్వామి శోభాయాత్ర

తాడిపత్రి అర్బన్: పట్టణంలోని సీబీ రోడ్డులోని మార్కండేయ స్వామి ఆలయంలో బహుత్తమ పద్మశాలీయుల సంఘం ఆధ్వర్యంలో శనివారం మార్కండేయస్వామి జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పట్టు వస్త్రాలను సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో గణపతి పూజ, ధ్వజారోహణ, హోమం, పూర్ణాహుతి తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయం నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకూ, అక్కడి నుంచి వైఎస్సార్ సర్కిల్ వరకూ మార్కండేయస్వామి ఉత్సవ విగ్రహంతో నిర్వహించిన శోభాయాత్రలో చిన్నారుల కోలాటం, నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఈసందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున స్వామిని దర్శించుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

విద్యాభివృద్ధికి వారి కృషి వెలకట్టలేనిది



కేసీ నారాయణ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

గుంతకల్లు: ఈ ప్రాంత విద్యాభివృద్ధికి దివంగత కేసీ నారాయణ, నెట్టప్ప కృషి వెలకట్టలేనదని వక్తలు పేర్కొన్నారు. శనివారం శ్రీ శంకరనంద గిరిస్వామి డిగ్రీ కళాశాల ఆవరణంలో శ్రీ శంకరనంద గిరిస్వామి ఎడ్యుకేషన్ సొసైటీ వ్యవస్థాపకులు కేసీ నారాయణ, డీపి నెట్టప్ప విగ్రహాలను ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హైకోర్టు విశ్రాంతి న్యాయమూర్తి చల్లా కోదండరాం, ఉమామహేశ్వర పీఠాధిపతి ప్రణవానందస్వామి, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ రమణమూర్తి, ఏపీ ట్రాన్స్‌కో డీఈ చల్లా నారాయణ, శ్రీ ప్రొడక్షన్ సినీ నిర్మాత పురమెట్ల తిమ్మప్ప నాయుడు (ఎస్ఆర్ఐ) తదితరులు హాజరై మాట్లాడారు. యువత వీరిని ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. అనంరతం కళాశాల ఆవరణలో నిర్మించిన అబ్దుల్ కలాం ఓపెన్ యాంపీ థియేటర్‌తో పాటు డాక్టర్ ఆర్‌వీ నాయుడు మెమోరియల్ లాస్‌ను ప్రారంభించారు. కరస్పాండెంట్ కేసీ హరికుమార్, కళాశాల సొసైటీ వైస్ చైర్మన్ రంగయ్య, కోశాధికారి అశ్వర్థమ్మ, మెంబర్లు ఆదప్ప, ఎంపీ బాలయ్య, ఎంసీ రంగయ్య, డైరెక్టర్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

రేషన్ పంపిణీ సక్రమంగా చేపట్టండి

పామిడి: రేషన్ పంపిణీని సక్రమంగా చేపట్టాలని తహసీల్దార్ ఎస్.శ్రీధరమూర్తి సూచించారు. శనివారం ఆయన మాట్లాడుతూ డీలర్లు తూకాల్లో అవకతవకలకు పాల్పడకూడదన్నారు. రేషన్ సరుకులపై అదనంగా డబ్బులు వసూలు చేస్తే డీలర్లపై చర్యలు తప్పవన్నారు.

పన్నులు చెల్లించండి

పామిడి: నీరు, ఇంటి పన్ను ఇతరత్రా పన్నులను సకాలంలో చెల్లించి పంచాయతీ అభ్యున్నతికి పాటుపడాలని ఈఓ ఎం.గోపాల్ శనివారం తెలిపారు. ముఖ్యంగా వ్యాపార నిర్వహణకు సంబంధించి పన్నుల చెల్లింపులో జాప్యాన్ని వీడాలన్నారు. లేనిపక్షాన పెనాల్టీ విధిస్తామన్నారు.

కారు, ప్రైవేట్ బస్సు ఢీ

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌లోని పత్తికొండ ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో శనివారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ప్రైవేట్ బస్సు-కారు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ప్రమాదంలో కారు స్వల్పంగా డ్యామేజీ అయింది. ప్రాణాపాయం తప్పింది. కారు డ్యామేజీ కావడంతో డ్రైవర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వ్యక్తి ఆకస్మిక మృతి

పామిడి: పట్టణంలోని నాగిరెడ్డి కాలనీకి చెందిన వడ్డే దేవదాసు శనివారం దుస్తులు కట్టింగ్ చేస్తూ ఆకస్మిక మృతి చెందాడు. వడ్డే దేవదాసు నైటీ కట్టింగ్ మాస్టర్‌గా ఉప్పర చంద్ర షాపులో పనిచేస్తూ కుటుంబాన్ని నెట్టుకొచ్చేవాడు. మధ్యాహ్నం భోజనం చేసి పనికి వెళ్ళాడు. షాపులో నీరు తాగి క్లాత్ కట్టింగ్‌కు పూనుకున్నాడు. ఉన్నఫళంగా కట్టింగ్ చేస్తూనే కుప్పకూలాడు. అతడికి భార్య శ్రీదేవితో పాటు కుమారుడు రోహిత్ మణికంఠ, కుమార్తె గౌతమి ఉన్నారు. యజమానిని కోల్పోయి రోడ్డున పడ్డ బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

గుత్తి: గుత్తి మున్సిపాలిటీ పరిధిలో సమాజంలో ఆర్థికంగా వెనుకబాటుకు గురైన వర్గాలకు చెందిన వారు సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా సూచించారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఏపీ వెనుక బడిన తరగతుల కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాల కోసం అర్హులు వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 21 నుంచి 60 సంవత్సరాల లోపు వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. బీసీలకు 38 యూనిట్లు, ఈబీసీ 3, కమ్మ 2, రెడ్డి 1, ఆర్యవైశ్య 1, కాపు 9 యూనిట్ల చొప్పున మంజూరయ్యాయన్నారు. అర్హులైన వారు ఈ నెల 7 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

గుత్తి రూరల్: మండలంలోని బాచుపల్లిలో ఉపాధి పనులను ఎంపీడీఓ ప్రభాకర్‌నాయక్ శనివారం పరిశీలించారు. గ్రామ శివారులో జరుగుతున్న పనులను ఎంపీడీఓ తనిఖీ చేసి కూలీలకు సూచనలు ఇచ్చారు. జాబ్ కార్డులు ఉన్న వారు మాత్రమే పనులు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ మద్దిలేటి, ఫీల్డ్ అసిస్టెంట్ నరసింహులు, కూలీలు పాల్గొన్నారు.

ఆకుకూరలతో ఆరోగ్యం

బుక్కరాయసముద్రం: ఆకు కూరలు తీసుకోవడం వల్ల గర్భిణుకు, బాలింతలు ఆరోగ్యంగా ఉంటారని రేకులకుంట సర్పంచ్ నరసమ్మ తెలిపారు. శనివారం రేకులకుంట గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం రేకులకుంటలో ఆర్గానిక్‌తో పండించిన ఆకుకూరలను గర్భిణులు, బాలింతలకు అందజేశారు. అంగన్‌వాడీ కార్యకర్త విమలా సుజాత, లక్ష్మి, ఎర్రినాగమ్మ, ఆయాలు తదితరులు పాల్గొన్నారు

5న ఫీజు పోరుకు తరలిరండి



శింగనమలలో ఫీజు పోరు పోస్టర్లను విడుదల చేస్తున్న వీరాంజనేయులు



గుంతకల్లులో ఫీజు పోరు పోస్టర్లను విడుదల చేస్తున్న నైరుతిరెడ్డి

శింగనమల/గుంతకల్లు టౌన్: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈనెల 5న జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వద్ద వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో తలపెట్టిన ఫీజు పోరు కార్యక్రమానికి విద్యార్థుల తల్లితండ్రులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలిరావాలని శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త వీరాంజనేయులు, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు, గుంతకల్లు మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం శింగనమలలోని రామాలయంలో, గుంతకల్లులో ఫీజుపోరుకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఆయా కార్యక్రమాల్లో వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలవుతున్నా, విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఎంతో ఉన్నత ఆశయంతో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ప్రవేశ పెట్టడంతో, ఎంతో మంది పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు సాధించారన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సైతం విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అందించారన్నారు. కానీ కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటోందని విమర్శించారు. జగనన్న పిలుపు మేరకు జిల్లా స్థాయిలో అనంతపురంలో ఫీజు పోరు కార్యక్రమం నిర్వహిస్తున్నామని, శింగనమల, గుంతకల్లు నియోజకవర్గం నుంచి భారీగా తరలిరావాలని వారు కోరారు. శింగనమలలో వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ విభాగం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు నాయక్, పార్టీ జిల్లా అధికార పార్టీ ప్రతినిధి, పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు బెస్త ప్రసాద్, నాయకులు భాస్కర్‌రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, వెంకటనారాయణ, రామచంద్ర, నవీన్, మనోజ్, శ్రీకాంత్‌రెడ్డి, గురుమూర్తి రెడ్డి, మల్లికార్జున రెడ్డి, భాస్కర్, ఎల్. రాజు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. అలాగే గుంతకల్లులో నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ వీసీ మైమూన్, వైఎస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వంశీయాదవ్, నియోజకవర్గ అధ్యక్షుడు నక్కా నారప్ప, రాష్ట్ర మాజీ కార్యదర్శి ఖలీల్, కౌన్సిలర్లు లింగన్న, సుమో బాషా, కో ఆప్షన్ సభ్యుడు ఫ్లయింగ్‌మాబు, పార్టీ అనుబంధ సంఘాల నియోజకవర్గం అధ్యక్షులు మల్లికార్జునశాస్త్రి తిక్కస్వామి, మోతేమస్తాన్, వీరేష్, అబ్దుల్‌బాసిద్, హాజీ, పవన్, షాబుద్దీన్, మేరీ, సూర్యారెడ్డి, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

అశ్వత్థం ఉత్సవాల ఏర్పాట్లపై ఏఎస్పీ ఆరా

తాడిపత్రిటౌన్: పెద్దపప్పూరు మండలం అశ్వత్థనారాయణస్వామి బ్రహోత్సవాల సందర్భంగా పోలీస్ బందోబస్తుపై ఏఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి సీఐ సాయిప్రసాద్‌తో ఆరా తీశారు. పట్టణంలోని పోలీస్ స్టేషన్ శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులు తనిఖీ చేశారు. పలు కేసులపై సీఐతో ఆరా తీశారు. అలాగే ఆదివారం నుంచి నిర్వహించే అశ్వత్థం బ్రహోత్సవాల బందోబస్తు పై ఆరా తీశారు. పాత కేసుల పురోగతిపై ప్రశ్నించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



సీఐ సాయిప్రసాద్‌తో ఏఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి

తిరునాలకు ప్రత్యేక బస్సులు

తాడిపత్రి అర్బన్: పెద్దపప్పూరులో ఆదివారం నుంచి నిర్వహిచే అశ్వత్థం బ్రహోత్సవాలకు తాడిపత్రి ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపుతున్నట్లు డీఎం జి.ఎల్.శంకర్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నాలుగు వారాల పాటు నిర్వహించే ఉత్సవాలకు భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేచ బస్సు సర్వీసులను నడుపుతున్నామన్నారు. మొదటి ఆదివారం సందర్భంగా తాడిపత్రి నుంచి 8 బస్సు సర్వీసులను ప్రారంభిస్తామన్నారు. రెండో వారం 14 బస్సులు, మూడో వారం 20, నాలుగో వారం 15 బస్సు సర్వీసులను నడుపునున్నట్లు డిఎం తెలిపారు. భక్తులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పింఛన్లు వంద శాతం పంపిణీ చేయాలి

గార్లదిన్నె: పింఛన్ల పంపిణీ వందశాతం చేయాలని హంద్రీ-నీవా సుజల స్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్) స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మల్లికార్జున సూచించారు. శనివారం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గార్లదిన్నెలో ఫించన్లు పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్లు పంపిణీ చేయాలన్నారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ బాబాప్రక్రుద్దీన్, ఈఓఆర్డీ దామోదరమ్మ పాల్గొన్నారు.

పంచాయతీలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

గార్లదిన్నె: పంచాయతీల్లో డంపింగ్ యార్డుల ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించాలని మండల స్పెషల్ ఆఫీసర్, మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులునాయక్ సూచించారు. శనివారం గార్లదిన్నె ఎంపీడీఓ కార్యాయాన్ని ఆయన తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు.

పింఛన్ల పంపిణీకి సర్వర్ కష్టాలు



తాడిపత్రిలో సర్వర్ సమస్యపై సిబ్బందితో ఆరా తీస్తున్న ఈఓఆర్డీ వెంకటేష్



సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ శివరామకృష్ణ

తాడిపత్రి రూరల్: పింఛన్ల పంపిణీలో సర్వర్లు సరిగా పనిచేయకపోవడంతో సిబ్బంది ఇబ్బందులు పడ్డారు. ఫిబ్రవరి 1వ తేదీ తాడిపత్రి పట్టణ, మండలంలో ఇంటింటి ఫించన్ల పంపిణీ కోసం మునిసిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది తెల్లవారు జామున పట్టణంలోని 36 వార్డులు, మండలంలోని 26 పంచాయతీల్లోని గ్రామాలకు పయనమయ్యారు. మండలంలో పనిచేస్తున్న సచివాలయ సిబ్బందిలో ఎక్కువ శాతం మంది తాడిపత్రి పట్టణంలో నివాసం ఉంటున్నారు. వారు ద్విచక్ర వాహనాల్లో ఫించన్ల పంపిణీ కోసం ఇంటింటికీ వెళ్లారు. పింఛన్‌దారులు వేలి ముద్రలను తీసుకునేందుకు ప్రయత్నించారు. కానీ సర్వర్లు పనిచేయలేదు. పలుమార్లు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. దీంతో సిబ్బంది ఇబ్బందులు పడ్డారు. ఫించన్ల కోసం వెచి ఉన్న వారు సహనం కోల్పోయారు. ఈ విషయాన్ని పట్టణంలో ఫించన్లు పంపిణీ చేస్తున్న సిబ్బంది మునిసిపల్ కమిషనర్ శివరామకృష్ణ, మండలంలోని సిబ్బంది ఈఓఆర్డీ వెంకటేష్‌కు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న వారు పంపిణీ వద్దకు వచ్చి ఆరా తీశారు. సిబ్బంది సెల్‌ఫోన్లలోని యాప్‌లు సరిగా పనిచేయడం లేదని గుర్తించారు. ప్రాసెసింగ్ ప్లీజ్ వెయిట్ అన్న ఎర్రర్ వస్తోందని వారి ముందు సిబ్బంది వాపోయారు. అనంతరం సర్వర్ పనిచేయడంతో అష్టకష్టాలు పడ్డ సిబ్బంది పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని కొనసాగించారు.

యల్లనూరు: మండలవ్యాప్తంగా పింఛన్ల ప్రక్రియ జరుగుతుండగా సర్వర్ మొరాయించడంతో పండుటాకులకు కాసేపు నిరాశ ఎదురైంది. యల్లనూరు మండలంలో ఉదయం 6.30 గంటల వరకూ సర్వర్ పని చేసింది. అనంతరం 9.30 గంటలు అవుతున్నా సర్వర్ పనిచేయకపోవడంతో పింఛనుదారులు చాలా ఇబ్బందులు పడ్డారు. ఉదయం నుంచి 10 గంటల వరకూ పంపిణీ కేంద్రాల వద్ద పడిగాపులు కాశారు. అనంరతం సర్వర్ పనిచేయడంతో పింఛన్‌దారులు ఊపిరిపీల్చుకున్నారు.